
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 2 అక్టోబరు 2024 | 5





నేడు గాంధీ జయంతి

గాంధీ.. నడిచాడిక్కడ!

ఉమ్మడి తూర్పున బాపూజీ అడుగుజాడలు

మహాత్ముడి జీవితమే.. ఒక మహోద్యమం. చేతిలో ఊతకర్ర.. బక్కపలుచని శరీరం.. అదీ వయస్సుమీరిన రోజుల్లో ఎలాంటి ఆయుధం లేకుండా స్వాతంత్ర్యం సిద్ధించేదాకా జాతి యావత్తునూ ఏకతాటిపై నడిపించాడంటే ఆయనను మహాత్ముడుకాక ఇంకేమంటాం. అందుకే ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ గాంధీజీని ఉద్దేశించి చెప్పినట్టు "కొన్నేళ్ల తర్వాత రక్తమాంసాలు గల ఇలాంటి వ్యక్తి భూమ్మీద నడిచాడని చెబితే రాబోయే ముందు తరాల వారు నమ్మలేరు.." ఎంత గొప్ప నిర్వచనం ఇది. స్వాతంత్ర్య పోరాటం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో మన జాతిపిత దేశమంతటా పర్యటించారు. ప్రజలందరినీ స్వాతంత్ర్య సమరంలోకి దూకేలా ఉత్తేజితమైన ప్రసంగాలు చేశారు. పోరాటంలో ముందుండి నడిపించారు. మన గోదావరి జిల్లాల్లోనూ గాంధీజీ విస్తృతంగా పర్యటించి సమరశంఖం పూరించారు. ఆయన వెంట ప్రజలంతా ఏకమై నడిచారు. స్వరాజ్యం మా హక్కని ముక్తకంఠంతో నినదించారు. స్వాతంత్ర్య పోరులో జైళ్లకెళ్లారు. గాంధీజీ జయంతి సందర్భంగా ఆయన స్మృతులు మళ్లీ ముందుకు..

- రాజమండ్రి (ఆంధ్రజ్యోతి)/ కాకినాడ సిటీ/కరప


రాజమండ్రికి వచ్చింది.. 5 సార్లు

1921 మార్చి 30వ తేదీ రాత్రి గాంధీ తొలిసారిగా రాజమహేంద్రవరంలో అడుగుపెట్టారు. విజయనగరంలో తన పర్యటన ముగించుకుని బెజవాడ మెయిల్‌లో వెళుతూ ఇక్కడి రైల్వే స్టేషన్‌లో ఆహ్వానం మేరకు దిగారు. 1921 ఏప్రిల్ 6వ తేదీన మహాత్మాగాంధీ దంపతులు కాకినాడ నుంచి రాజమహేంద్రవరం సభకు విచ్చేశారు. 1929 మే 6న గాంధీ మూడోసారి వచ్చారు. గాంధీజీ.. సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు టౌన్‌హాల్‌ను సందర్శించినట్టు చెబుతారు. 1933 డిసెంబర్ 24న ఆయన నాల్గోసారి పాల్ చౌక్‌లో ఆయన ప్రసంగించారు. ఐదోసారి అంటే చివరగా 1946 జనవరి 20 రాజమండ్రి వచ్చారు.

దక్షిణాఫ్రికా టూ తుని..

తుని రూరల్ : స్వాతంత్రోద్యమ పర్యటనకు ముందే గాంధీ తునిలో పర్యటించి బస చేశారు. ఆ ప్రాంతం ప్రస్తుతం గాంధీ సత్రంగా పేరుపడింది. 1915లో దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి వచ్చిన గాంధీజీ దేశ ప్రజల స్థితిగతులను తెలుసుకునేందుకు దేశ పర్యటనలో భాగంగా 1916లో రైలులో మార్గమధ్యలో తునిలో ఆగారు. తునికి ప్రధాన కూడలిగా ఉన్న గొల్లప్రోలు సెంటర్ పక్కనే సత్రం ప్రాంగణంలో ఒక పెద్ద చెట్టు కింద ఈ ప్రాంతవాసులతో సభ నిర్వహించి స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపారు. ఆ రాత్రి అక్కడే బస చేసి మరుసటిరోజే పయనమయ్యారు.

కాకినాడలో మ్యూజియం



కార్పొరేషన్(కాకినాడ):స్వాతంత్రోద్యమ సమయం 1921 నుంచి 1929 మధ్యలో మూడుసార్లు గాంధీజీ కాకినాడ వచ్చారు. గాంధీజీ ఇక్కడికి వచ్చినప్పటి విషయాలతో పాటు ఆయన బాల్యం నుంచి స్వాతంత్ర్యం సాధించే వరకు ఉన్న జీవిత ఘట్టాలను తెలియజేస్తూ కాకినాడ కార్పొరేషన్ వెనుక ప్రాంతంలో గాంధీభవన్ ఏర్పాటు చేశారు. ఇందులో గాంధీజీ మ్యూజియం, ఆయన చిత్రపటాలతోపాటు 400 కిలోల కాంస్య విగ్రహం ఏర్పాటుచేశారు. ఆయనను నిత్యం స్మరించుకునేలా గాంధీనగర్‌లో ఓ పార్కుకు గాంధీపార్కుగా, ఓ ప్రాంతానికి గాంధీనగర్‌గా అప్పట్లోనే నామకరణం చేశారు. కాకినాడ గాంధీభవన్ పేరున కరపలో 5.87 ఎకరాల భూమి ఉంది. వేళంగి గ్రామానికి చెందిన మెర్ల వెంకటసుబ్బారావు 1952 ఆగస్టు 5న తన స్వార్జిత భూమిని గాంధీభవన్ ట్రస్టుకు రాసిచ్చారు.

కాకినాడకు మూడుసార్లు..

స్వాతంత్రోద్యమకాలంలో మహాత్మాగాంధీ కాకినాడలో మూడుసార్లు పర్యటించారు. 1921 ఏప్రిల్ 3న కాకినాడలో గాంధీజీ దంపతులు, వారి నాలుగో కుమారుడు రైలు దిగారు. గుర్రపు బండిపై పెద్ద బజారు గుండా జగన్నాథపురంలోని పైడా వెంకట నారాయణ ఇంటికి చేరుకున్నారు. 1923 డిసెంబర్ 28న గాంధీనగర్‌లో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సభలకు జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేల్ వంటి నేతలు విచ్చేయగా, పరవాడ జైలులో ఉన్న కారణంగా మహాత్మాగాంధీ హాజరు కాలేకపోయారు. ఆ తర్వాత 1930, 1933లలో రెండుసార్లు కాకినాడ వచ్చిన గాంధీ స్వాతంత్రోద్యమ సభల్లో పాల్గొన్నారు.

సీతానగరంలో సత్యాగ్రహాశ్రమం



గాంధీ బసచేసిన చోడవరంలో భవనం ఇదే

సీతానగరం: రాజమహేంద్రవరానికి 25 కి.మీ దూరంలో ఉన్న సీతానగరంలో 1924 నవంబరు 9న వైద్యుడు బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్యం గోదావరి గట్టుకు సమీపంలో గౌతమి సత్యాగ్రహ ఆశ్రమం పేరుతో ఏర్పాటుచేశారు. దీనికి అల్యూమినియం వ్యాపారి శేర్ జీవన్‌లాల్ ఆర్థిక సాయం అందించారు. ఈ ఆశ్రమాన్ని బాపూజీ రెండు సార్లు సందర్శించడం విశేషం. 1925 ఫిబ్రవరి 4న డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం ఇక్కడ గృహ ప్రవేశం జరిపారు. గాంధీజీ తన స్వాతంత్రోద్యమ పర్యటనలో భాగంగా 1929 మే 8, 9 తేదీల్లో ఆశ్రమంలో బస చేశారు. 1933 డిసెంబరులో ఈ ఆశ్రమానికి రెండోసారి వచ్చి ఆశ్రమవాసులను ఉత్తేజపర్చారు. బాపూజీ సతీసమేతంగా ఆశ్రమంలో విశ్రాంతి తీసుకున్నారు. కస్తూర్బాగాంధీ పరమపదించిన అనంతరం ఆమె పేరుతో గౌతమి సత్యాగ్రహాశ్రమానికి కస్తూర్బాగాంధీ ఆశ్రమంగా పేరు మార్చారు.

నేటికీ ఆ గాంధీ భవన్‌లు పదిలమే!

ద్రాక్షారామ/రాజోలు: మహాత్మాగాంధీ స్వాతంత్ర్య పోరాటంలో 1929 ఏప్రిల్, మే నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. మే నెలలో రామచంద్రపురం మండలం వెల్ల, చోడవరం గ్రామాల్లో గాంధీజీ పర్యటించారు. మే 1న వెల్ల వంతెన వద్ద బహిరంగ సభలో ప్రసంగించారు. అనంతరం సాయంత్రానికి చోడవరం చేరుకుని రాత్రి బిక్కిన వెంకటరత్నం (మాజీ కేంద్ర మంత్రి) నివాసంలో బసచేశారు. ఆ భవనం ఇప్పటికీ చెక్కు చెదరలేదు. 1929 మే 5న ఆదివారం గాంధీ అమలాపురం మీదుగా సాయంత్రం 6 గంటలకు మామిడికుదురు మండల పాశర్లపూడి రేవు దాటారు. గాంధీ తన సహచరి కస్తూరిబాతో రాత్రి 8 గంటలకు పొన్నాడ సూర్యారావు ఇంటికి అతిథిగా విచ్చేశారు. వారికి అపూర్వమైన ఆతిథ్యాన్ని సూర్యారావు అందించారు. ఆ రాత్రి గాంధీజీ మౌన వ్రతం చేశారు. 1929 మే 5, 6 తేదీల్లో పొన్నాడ సూర్యారావు ఇంట్లోనే గాంధీ బస చేయడం విశేషం. అప్పటి నుంచి ఆ ఇల్లు గాంధీ హౌస్ అయింది.

పలివెలలో గాంధీజీ..



పలివెల సత్రం ఇదే..

కొత్తపేట, అక్టోబరు 1 : స్వాతంత్ర్య సమరయోధులైన కళా వెంకట్రావు, నడింపల్లి సుబ్బరాజు, బలుసు సాంబమూర్తి, తురగా పురుషోత్తం తదితరుల పిలుపు మేరకు మహాత్మాగాంధీ 1929 మే 5న పలివెలలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. 1929లో ఖద్దర్ నిధులకు విరాళాలు సేకరణ, కాంగ్రెస్ మూల సిద్ధాంతమైన స్వరాజ్యం నుంచి సంపూర్ణ స్వాతంత్రోద్యమ తీర్మానానికి కొత్తపేట మండలం పలివెలలోనే బీజం పడిందని గాంధీ అధ్యయన సంస్థ వ్యవస్థాపకుడు వెంకటేశ్వర్లు తెలిపారు. పలివెలలో 1929 మే 5న పర్యటించిన మహాత్మాగాంధీ ఖద్దర్ నిధికి రూ.1,117లు విరాళాలుగా సేకరించారు.

133 మద్యం షాపులకు నోటిఫికేషన్

ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

11న కలెక్టరేట్‌లో మద్యం షాపుల లక్కీడ్రా

దరఖాస్తుకు రూ.2 లక్షలు

నాన్‌రిఫండబుల్ డిపాజిట్

గెజిట్ నోటిఫికేషన్

జారీచేసిన ఎక్సైజ్ శాఖ

(అమలాపురం-ఆంధ్రజ్యోతి): నూతన మద్యం షాపుల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీ, 22 మండలాల పరిధిలో 133 మద్యం షాపుల కేటాయింపునకు ఉత్తర్వులు జారీ చేసింది. జనాభా ప్రాతిపదికన జిల్లాలో ఈ మద్యం షాపులను మంజూరు చేశారు. రెండు సంవత్సరాల కాలపరిమితికి లైసెన్సు మంజూరు చేయనున్నారు. షాపు ఒక్కింటికీ రూ.2 లక్షలు నాన్ రిఫండబుల్ డీడీని దరఖాస్తుతో పాటు అందజేయాలి. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం షాపులకు సంబంధించి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 8 గంటల నుంచి అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గల గోదావరి భవన్‌లో లాటరీ ద్వారా మద్యం షాపుల ఎంపిక జరగనుంది. రిజిస్ట్రేషన్స్, అప్లికేషన్స్ జిల్లాలోని నిర్ధారించిన వివిధ కార్యాలయాల్లో అందజేయాల్సిందిగా సూచించారు. అమలాపురంలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్, ముమ్మిడివరంలోని ఎక్సైజ్‌స్టేషన్, కొత్తపేట, రాజోలు, ఆలమూరు, రామచంద్రపురంలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులను స్వీకరిస్తారు. 11వ తేదీ లాటరీలో షాపులు దక్కించుకున్న వారికి ఈ నెల 12వ తేదీ నుంచి 2026 సెప్టెంబరు 30 వరకు అర్హత కలిగి ఉంటారు. జనాభా ప్రాతిపదికన లైసెన్సు ఫీజులను నిర్ధారించారు. పదివేల జనాభా వరకు ఉన్న షాపునకు రూ.50 లక్షలు, 10వేల నుంచి 50వేల వరకు జనాభా ఉన్న షాపునకు రూ.55 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల జనాభా కలిగిన షాపులకు రూ.65 లక్షలు, 5 లక్షలు జనాభా పైబడి ఉన్న షాపునకు రూ.85లక్షల లైసెన్సు ఫీజుగా చెల్లించాలని ప్రభుత్వం నిర్ధారించింది. రెండో సంవత్సరంలో మద్యం షాపుల నిర్వహణకు 10 శాతం ఫీజు అదనంగా పెంచి 12 సమాన వాయిదాల్లో చెల్లించాలని సూచించారు. దీనిలో భాగంగా జిల్లాలో రూ.55లక్షలు ఫీజు చెల్లించే షాపులు 6, రూ.65లక్షలు లైసెన్సు ఫీజు చెల్లించే షాపులు 127 ఉన్నాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు అప్లికేషన్ ఫీజును రూ.2లక్షలు నాన్‌రిఫండబుల్‌గా చెల్లించాలి. ఒక వ్యక్తి ఎన్ని అప్లికేషన్లయినా వేసుకోవచ్చు. ప్రతీ అప్లికేషన్‌కు రూ.2 లక్షల డీడీ, రూ.5 కోర్టు ఫీజు స్టాంపును అతికించాలని, వ్యక్తిగత గుర్తింపు కోసం ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పుస్తకం, నోటరీ ఐడీకార్డు, అవసరమైన ఇతర ధ్రువపత్రాలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను అందించాల్సిందిగా జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి ఎస్కేడీవీ ప్రసాద్ సూచించారు. 11వ తేదీ ఉదయం 8 గంటల నుంచి అమలాపురంలోని గోదావరి భవన్‌లో మద్యం షాపుల లాటరీ ప్రక్రియ కొనసాగుతుంది. ఎంట్రీ పాసులు ఉన్నవారిని మాత్రమే లోనికి అనుమతిస్తామని తెలిపారు. జిల్లాలో మద్యం షాపుల కోసం అప్పుడే లాబీయింగ్‌లు ప్రారంభమయ్యాయి.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

7లో

కిమ్స్ వెంకన్న ఆలయం చోరీ సొత్తు స్వాధీనం

మా పరిస్థితేంటి?

ప్రభుత్వ మద్యం షాపుల సిబ్బంది నిరసన బాట

షాపులు బంద్ చేసి ఆందోళన

పి.గన్నవరం, అక్టోబరు 1: ప్రైవేటు మద్యం షాపులు రానుండడంతో ఇప్పటివరకు ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేసిన సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ప్రభుత్వానికి వినతులు అందిస్తున్నారు. సెప్టెంబరు 30వ తేదీతో అగ్రిమెంట్ పూర్తవడంతో సిబ్బంది మంగళవారం షాపులను తెరవకుండా నిరసన బాట పట్టారు. 15 రోజులు విధులు నిర్వహించాలని ఉన్నతాధికారులు కోరినప్పటికి ఉద్యోగ భద్రతకు స్పష్టమైన హామీ కావాలని షాపులు తెరిచేందుకు సిబ్బంది ముందుకు రాని పరిస్థితి నెలకొంది. దీంతో మందుబాబులు ఉదయం 11 గంటలకే షాపులు చుట్టూ ప్రదక్షిణలు మొదలుపెట్టారు.

బెల్ట్ షాపుల్లో అమ్మకాల జోరు

అంబాజీపేట, అక్టోబరు 1: ప్రభుత్వ మద్యం షాపులు మూతపడడంతో బెల్ట్‌షాపులలో మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. అంబాజీపేట పోలీస్‌స్టేషన్ కూత వేటుదూరంలో ఉన్న బెల్ట్‌షాపులో మద్యం అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఆ వైపు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. మాచవరం పరిధిలోని మెట్లకాలనీ, హడ్కో కాలనీ, చిరతపూడి, ఇసుకపూడి, వాకలగరువు, గంగలకుర్రు, ముక్కామల, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల్లో బెల్ట్‌షాపులలో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గాంధీ జయంతి కావడంతో ఎక్కువ మొత్తం మద్యాన్ని నిల్వ చేసుకున్నారు.

బాలయోగి సేవలు చిరస్మరణీయం



అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో నివాళులర్పిస్తున్న నేతలు

లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆయనకు నాయకులు ఘన నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు..

8

ప్రజల భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్

జాయింట్ కలెక్టర్ నిషాంతి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం టౌన్, అక్టోబరు 1: ప్రజలందరి భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు కృషి చేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. ఆర్థిక రంగం 15 శాతం వార్షిక అభివృద్ధితో స్థానికంగా లభించే వరి, కొబ్బరి, ఆక్వా రంగాల విలువ ఆధారిత పరిశ్రమలతో పాటు విద్యా, ఆరోగ్యం, సామాజిక, సంక్షేమ మౌలిక సదుపాయాల సుస్థిర ఆర్థికాభివృద్ధిని సూచించే విధంగా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించనున్నట్లు చెప్పారు. కలెక్టరేట్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులు, వివిధ రంగాల ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జేసీ సమావేశం నిర్వహించారు. రానున్న ఐదేళ్ల కాలానికి ముందుగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సి ఉందన్నారు. అన్నివర్గాల ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలు సేకరించారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) మాట్లాడుతూ స్థానికంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నెలకొల్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మూడు పంటలు పండించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. సీపీవో వెంకటేశ్వర్లు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ..

నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను నిర్వహించాలని జేసీ టి.నిషాంతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. తొలుత రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అమరావతి నుంచి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టరేట్ నుంచి జేసీ పాల్గొన్నారు. సంక్షిప్త సవరణ ప్రక్రియలో భాగంగా ఇంటింటా సర్వే, క్లయిమ్‌ల పరిష్కారం, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఇంటింటా సర్వే 99.58 శాతం పూర్తయిందన్నారు. ఎపిక్ కార్డులో వ్యత్యాసాలు సరిచేస్తున్నామన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ మురళీకృష్ణ, తహసీల్దార్ డి.కిశోర్‌బాబు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు ఉచిత హక్కులు..

20 ఏళ్లు పైబడిన అసైన్డ్ భూములకు ఉచిత హక్కులు కల్పించడంతో పాటు కుల ధ్రువీకరణ పత్రాల జారీలో నియమ నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని జేసీ టి.నిషాంతి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. తొలుత రాష్ట్ర రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, భూపరిపాలన శాఖ ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆమె పాల్గొన్నారు. అనంతరం జేసీ జిల్లాలోని రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. రెవెన్యూ అంశాలను సకాలంలో పరిష్కరించాలని జేసీ ఆదేశించారు.

తొలిరోజు 97.8 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి



పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే దాట్ల

అమలాపురం టౌన్, అక్టోబరు 1: జిల్లాలో తొలిరోజు మంగళవారం 97.8 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేసినట్టు డీఆర్డీఏ పీడీ వి.శివశంకరప్రసాద్ తెలిపారు. జిల్లాలోని 2,40,267 మంది పెన్షన్ లబ్ధిదారులకుగాను రాత్రి 7 గంటల సమయానికి 2,34,976 మందికి పెన్షన్ల పంపిణీ పూర్తి చేశామన్నారు. 5291 మందికి పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. రూ.99,80,85,500 నగదు బట్వాడా చేయాల్సి ఉండగా 97.8 శాతం అనగా రూ.97,61,17,500 బట్వాడా పూర్తిచేసినట్టు పీడీ తెలిపారు. జిల్లాలో అత్యధికంగా అంబాజీపేట మండలంలో 98.58 శాతం, మండపేట అర్బన్‌లో 98.43 శాతం, ఆత్రేయపురంలో 98.35 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేసినట్లు చెప్పారు.

శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వర స్వామివారి దేవస్థానం, ద్రాక్షారామ



దసరా మహోత్సవములు
ది.03-10-2024 నుండి 14-10-2024 వరకు

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ క్రోధి నామ సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమీ అనగా ది.03-10-2024 గురువారం నుండి 14-10-2024 సోమవారం వరకు శ్రీమాణిక్యాంబ అమ్మవారి శరన్నవరాత్ర మహోత్సవములు వేదపారాయణ ప్రయుక్త, దేవీభాగవతం, చండీ, సప్తశతీ, సుందరకాండ, మన్యుసూక్త, లలితా పారాయణములు, సూర్యనమస్కారములు, నవగ్రహజపములు, శ్రీచక్రనవావర్ణార్చన, లక్ష కుంకుమార్చన, సువర్ణ, రజిత పుష్పార్చన జరుపబడును

లక్ష కుంకుమార్చన సువర్ణ, రజత పుష్పార్చనలో పాల్గొనే భక్తులు దేవస్థానం వారికి రూ॥ 2,116/-లు చెల్లించి ఈ పూజలో పాల్గొనవచ్చును. (ఇద్దరికి మాత్రమే అనుమతి)
ప్రాత: కాల ప్రధమాభిషేక సేవ రూ. 500/- ఈ అభిషేకం ఉదయం 6.00 గం॥లకు ప్రారంభం అగును. ఈ అభిషేకములో పాల్గొన్న భక్తులకు అభిషేక ద్రవ్యములు శ్రీ స్వామివారి ప్రసాదం శేష వస్త్రం వేదాశీర్వచనం దేవస్థానం వారిచే నిర్వహించబడును.
దధి సేవ (ఆవు పెరుగు నివేదన) రూ॥ 200/- (ఒక పెరుగు పాత్రకు ప్రతీ రోజు శ్రీ స్వామి వారికి అర్చకస్వాములు మీ గోత్రనామములతో నివేధన చేసి ఇచ్చేదరు. నిత్యం జరిగే చండీ హోమమునకు 365 రోజులకు (1 సం॥రం) కాలమునకు రూ॥ 5,000/-లు చెల్లించి హోమములో సం॥రంలో ఒక్క రోజు స్వయంగా పాల్గొనవచ్చును.
నిత్యం జరిగే అభిషేకము, కుంకుమార్చనకు 365 రోజులకు (1 సం॥రం) కాలమునకు రూ॥ 2,000/-లు చెల్లించినచో మీ గోత్రనామములతో పూజ జర్పించబడును. ప్రతి శుక్రవారం ఉదయం గం॥10.30 ని॥ల నుండి రాహుకాల కుంకుమార్చన ఒక్క రోజుకి రూ॥ 500/-లు చెల్లించిన స్వయముగా కాని పరోక్షముగా కాని పాల్గొనవచ్చును.

కార్తీకమాసం
ది.02-11-2024 నుండి ది.01-12-2024 వరకు కార్తీకమాసం సందర్భముగా 30 రోజులు శ్రీ స్వామి వారికి అభిషేకం రూ॥ 1000/-లు, శ్రీ అమ్మవారికి కుంకుమార్చన రూ॥ 1000/- లు చెల్లించిన భక్తుల గోత్రనామములతో సామూహికంగా పూజలు జరిపించి వారి చిరునామాకు ప్రసాదం పంపబడును.

పై ఆర్జిత సేవలను ఈ కింద్రి ఆన్‌లైన్ ఎకౌంట్‌ను సొమ్ము చెల్లించవచ్చును.
శ్రీ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారి దేవస్థానం
Account No. : 01101001000471, IFSC Code: UBIN0801101, Union Bank, Drakshrama.
సంప్రదించవలసిన ఫోన్ నెం: 9491000244, 9908654608, 9652541111.
e-mail : eo.draksharama@gmail.com

శ్రీ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి అన్నదాన ట్రస్ట్, ద్రాక్షారామ

నిత్యదాత	- రూ. 2000
భక్త శిఖమణులు	- రూ. 5000
పోషకులు	- రూ. 10,000
రాజపోషకులు	- రూ. 25,000
మహారాజ పోషకులు	- రూ. 50,000
విశిష్ఠ రాజపోషకులు	- రూ. 1,00,000

అన్నప్రసాద విరాళములకు ఆదాయపన్ను (80జి) మినహాయింపు కలదు.

దేవి శరన్నవరాత్రులు, కార్తీకమాసములో, శ్రీస్వామివారిని, శ్రీఅమ్మవారిని దర్శించుకుని శ్రీస్వామివారి శ్రీఅమ్మవారి కృపకు పాత్రులుకాగలరు.

శ్రీ వాసంశెట్టి సుభాష్ గారు
రాష్ట్ర కార్మిక, పరిశ్రమలు, బాయిలర్స్ శాఖామాత్యులు

అల్లు వెంకట దుర్గాభవాని
సహాయ కమిషనర్ మరియు ఇ.ఓ.

రావి ఆకుపై గాంధీజీ చిత్రాలు






రావి ఆకుపై గాంధీ చిత్రం చెక్కిన ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు

గొల్లప్రోలురూరల్, అక్టోబరు 1: జాతిపిత మహాత్మాగాంధీ చిత్రాన్ని రావి ఆకుపై చెక్కారు కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు. లీఫ్ కార్వింగ్ కళ ద్వారా రావి ఆకుపై గాంధీజీ చిత్రాన్ని చిత్రించి దానిని చెక్కారు. బాపూజీ చేసిన దేశానికి చేసిన సేవలు, ఉద్యమం గురించి విద్యార్థులకు వివరించారు. గోవిందరాజులును ఎంఈవోలు వెంకటేశ్వరరావు, శివప్రసాద్, హెచ్ఎం సురేష్‌కుమార్‌లు అభినందించారు.

వాటర్ కలర్స్‌తో..



రావి ఆకుపై చిత్రకారుడు సొదాగర్ చిత్రించిన గాంధీజీ చిత్రం

రాయవరం: జాతిపిత గాంధీజీ పుట్టిన రోజును పురస్కరించుకుని రాయవరం గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు ఇందుగమెల్లి సొదాగర్ రెండు గంటలు శ్రమించి వాటర్ కలర్స్‌ను ఉపయోగించి రావి ఆకుపై గాంధీజీ చిత్రాన్ని చిత్రీకరించాడు.

రాగులు, ఇసుక, చోళ్లు, కాఫీ పొడర్‌తో..



అంగర విద్యార్థినులు రూపొందించిన గాంధీజీ చిత్రపటాలు



గాంధీజీ చిత్రపటాన్ని రూపొందిస్తున్న అంగర పాఠశాల విద్యార్థినులు

కపిలేశ్వరపురం: అంగర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాగులు, ఇసుక, చోళ్లు, కాఫీ పొడర్‌తో గాంధీజీ చిత్రాలను చిత్రీకరించారు. పాఠశాల చిత్రలేఖనం ఉపాధ్యాయుడు దాసర వెంకటేష్ పర్యవేక్షణలో విద్యార్థులు గాంధీజీ చిత్రాలు చిత్రీకరించారు. పాఠశాల హెచ్ఎం ఎ.రాజు విద్యార్థులను అభినందించారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- రూ.70లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- 40కు పైగా కేసుల్లో ఉన్న నలుగురు సభ్యుల ముఠా
- కిమ్స్ వెంకటేశ్వరాలయం కేసు ఛేదించిన పోలీసులు
- చోరీ సొత్తు బంగారం, వెండి మొత్తం రికవరీ
- కేసు ఛేదించిన పోలీసులకు రివార్డులు అందించిన ఎస్పీ
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ కృష్ణారావు



కిమ్స్ వెంకటేశ్వరాలయంలో చోరీకి గురైన ఆభరణాలను రికవరీ చేసి చూపిస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జల్సాలు, చెడు వ్యసనాలకు అలవాటు పడి వివిధ రాష్ట్రాల్లో భారీగా దొంగతనాలు, దోపిడీలకు పాల్పడ్డ నలుగురు సభ్యుల అంతర్‌రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.70లక్షల విలువైన చోరీ సొత్తును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉభయ రాష్ట్రాల్లో 40కు పైగా చోరీలకు పాల్పడ్డ ఈ ముఠాను తొలిసారిగా అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు వెల్లడించారు. ఈ కీలక కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం అమలాపురంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వివరించారు. అమలాపురం పట్టణానికి సమీపంలో ఉన్న కిమ్స్ వైద్య కళాశాలలో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గతనెల 4వ తేదీ అర్ధరాత్రి జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించి నిందితులను నుంచి సుమారు రూ.70లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. 868 గ్రాముల బంగారు ఆభరణాలు, 8.56 కిలోల వెండి ఆభరణాలను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ చెప్పారు. కిమ్స్‌లోని వేంకటేశ్వరాలయంలో చోరీ సొత్తు మొత్తం నిందితుల నుంచి రకవరీ చేసిన పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. శ్రీకాకుళం జిల్లా గుర్రాలమెట్ట గ్రామానికి చెందిన సవర సూర్యం అలియాస్ సూర్య (25), సవర చిన్నారావు అలియాస్ చిన్నా (24), జోగివలస గ్రామానికి చెందిన సవర రజనీ (24), తెలంగాణా రాష్ట్రంలోని మెదక్ జిల్లా మీమ్‌పూర్ గ్రామానికి చెందిన బత్తిన శ్రీకాంత్ (25) ఒక బృందంగా ఏర్పడి ఉభయ రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల్లో భారీగా దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నారు. చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడ్డ వీరు వ్యూహాత్మకంగా ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి పక్కా వ్యూహంతో దోపిడీలు చేయడం అలవాటు చేసుకున్నారు. ఈ ముఠా సభ్యులు ఒక కారును అద్దెకు తీసుకుని చోరీ చేయాలనుకున్న దేవాలయాలవద్ద ముందుగా రెక్కీ నిర్వహించి ఆ తరువాత చోరీకి పాల్పడుతుంటారు. ఈవిధంగా అమలాపురంలోని కిమ్స్‌లోని వెంకటేశ్వరాలయానికి వచ్చి రెక్కీచేసి గతనెల 4వ తేదీ రాత్రి భారీ చోరీకి పాల్పడ్డారు. సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత చాకచక్యంగా ఈ దోపిడీకి పాల్పడ్డ ముఠాను గుర్తించడంలో క్రైమ్ పోలీసులు చేసిన కృషి ప్రశంసనీయం. అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ నేతృత్వంలో అమలాపురం డీఎస్పీ టీఎస్‌ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు, మరో సీఐ ప్రశాంత్‌కుమార్, రూరల్ ఎస్ఐ వై.శేఖర్‌బాబుతోపాటు మరికొందరు పోలీసులను మూడు బృందాలుగా ఏర్పాటు చేసి నెలరోజుల వ్యవధిలోనే కిమ్స్ దోపిడీ కేసును ఛేదించి సొత్తు రికవరీ చేశారు. నిందితుల నుంచి 868 గ్రాముల బంగారం, 8.56 కిలోల వెండి, హ్యుండాయ్ వెర్నా కారు, నాలుగు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ ముఠా సభ్యులు శ్రీకాకుళం జిల్లాలో 37, విశాఖపట్నం సిటీలో ఒకటి, ప్రకాశం జిల్లాలో ఒకటి, గుంటూరు జిల్లాలో ఒకటి, తెలంగాణాలోని మెదక్ జిల్లాలో ఒకటి దొంగతనాలు, దోపిడీలకు పాల్పడినట్టు ఎస్పీ కృష్ణారావు చెప్పారు. అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకోవడంలో కీలక పాత్ర వహించిన సీఐలు వీరబాబు, డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ శేఖర్‌బాబు, ఏఎస్ఐ అయితాబత్తుల బాలకృష్ణ, క్రైమ్ పార్టీ సభ్యులను ఎస్పీ కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. వీరందరికీ క్యాష్ రివార్డులను ఎస్పీ అందించారు. చాకచక్యంగా నెలరోజుల వ్యవధిలోనే భారీ దోపిడీ కేసులను ఛేదించిన పోలీసులను ప్రజలు అభినందిస్తున్నారు.

నవోదయలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దాపురం, అక్టోబరు 1: స్థానిక జవహర్ నవోదయాలో 2025-26 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ప్రస్తుత విద్యాసంవత్సరంలో 8వ తరగతి చదువుతూ 1.5.2010 నుంచి 31.7.12 తేదీల మధ్య జన్మించి ఉండాలన్నారు. 11వ తరగతిలో ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రస్తుత విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదువుతూ 1.6.2008 నుంచి 31.7.2010 మధ్య జన్మించి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30న చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 8వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

- నన్నయ వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, అక్టోబరు1 : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన ఎంబీఏ, ఎంబీఏ (టూరిజం అండ్ హాస్పిటాలిటీ), ఎంసీఏ కోర్సుల్లోని భర్తీ కాని సీట్లకు ఈనెల 5న స్పాట్ కౌన్సెలింగ్ జరుగుతుందని వీసీ వై.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఏపీఐసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఇక్కడి ప్రాంగణంతోపాటు తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌లలో సంబంధిత సీట్లు భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. విశ్వవిద్యాలయంలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు ఉదయం 9-30నుంచి 11గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డి.జ్యోతిర్మయి పర్యవేక్షిస్తారని చెప్పారు. సీట్లు, ఫీజు వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చునని తెలిపారు.

90వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న పోలిశెట్టి తాతీలు

కరప, అక్టోబరు 1: జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు 90వ సారి రక్తదానం చేశారు. కాకినాడ అభయ బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం రక్తదానం చేసినట్టు ఆయన తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి స్ఫూర్తితో గత 30ఏళ్లగా మిత్రులతో కలిసి రక్తదానం చేస్తున్నట్టు వివరించారు. అలాగే కరప గ్రామానికి చెందిన దేవు మాణిక్యాలరావు(మిఠాయికొట్టు బాబీ) తన కుమార్తె మణిఐశ్వర్యదేవి పుట్టినరోజు సందర్భంగా 19వ సారి రక్తదానం చేశారు.

వినాయక నిమజ్జన ఊరేగింపు దాడిలో 21 మందికి రిమాండ్

కొవ్వూరు, అక్టోబరు 1 : కొవ్వూరు పట్టణంలో వినాయకుడి నిమజ్జన ఊరేగింపులో శ్రీరామకాలనీ, రాజీవ్‌కాలనీవాసుల మధ్య దాడికి కారణమైన 21 మందిని అరెస్టుచేసి రిమాండ్ నిమిత్తం జైలుకు పంపించినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు పట్టణంలోని రాజీవ్‌కాలనీకి చెందిన వినాయకుడి విగ్రహం నిమజ్జన ఊరేగింపులో శ్రీరామకాలనీ వద్ద జరిగిన రాళ్ల దాడికి సంబంధించి ఇరువర్గాలకు మొదటి దఫాగా కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. సెప్టెంబర్ 30న కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ శ్రీరామకాలనీ వాసులపై జరిగిన దాడికి సంబంధించి నమోదుచేసిన ఎస్సీ, ఎస్టీ కేసులో రాజీవ్‌కాలనీకి చెందిన 15 మందిని అరెస్టు చేశారు. అదేవిధంగా రాజీవ్‌కాలనీవాసులు అందించిన ఫిర్యాదుమేరకు నమోదు చేసిన కేసులో ఆరుగురిని అరెస్టు చేశారు. మొత్తం 21 మందిని మంగళవారం కొవ్వూరు 2వ అదనపు జ్యుడీషియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించడంతో 21 మందిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. శ్రీరామకాలనీ, రాజీవ్‌కాలనీలలో శాంతియుత వాతావరణం నెలకొనే వరకు పికెటింగ్‌లు కొనసాగిస్తున్నట్లు సీఐ విశ్వం తెలిపారు. ఈ కేసులకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతుందని, విచారణ అనంతరం మరికొంత మందిని అరెస్టు చేసే అవకాశం ఉందన్నారు.

విధుల్లో చేరిన మునిసిపల్ డీఈఈ

- సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేసిన హైకోర్టు



కమిషనర్‌కు జాయినింగ్ రిపోర్టు ఇస్తున్న డీఈఈ భవానీశంకర్

పిఠాపురం, అక్టోబరు 1: కాకినాడజిల్లా పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో డీఈఈగా పనిచేస్తున్న భవానీశంకర్ హైకోర్టు ఉత్తర్వులతో మంగళవారం తిరిగి విధుల్లోకి చేరారు. ఆగస్టు 31వ తేదీన జరిగిన పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్‌సభ్యులు సాక్షిగా కమిషనరు కనకారావు, డీఈఈ భవానీశంకర్‌లు పరస్పరం వాగ్వివాదం, తోపులాట, బాహాబాహికి దిగారు. దీనిపై అప్పట్లో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. జిల్లా కలెక్టరు నివేదిక ఆధారంగా డీఈఈ భవానీశంకర్‌ను అదేరోజు రాత్రి సస్పెండ్ చేస్తూ పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై భవానీశంకర్ హైకోర్టును ఆశ్రయించారు. తన వివరణ తీసుకోకుండా అన్యాయంగా సస్పెండ్ చేశారని హైకోర్టుకు విన్నవించారు. దీనిపై స్పందించిన హైకోర్టు ఇంజనీర్ ఇన్ చీఫ్ జారీచేసిన ఉత్తర్వులను పక్కన పెడుతూ ఉత్తర్వులు ఇచ్చింది. హైకోర్టు ఆదేశాలతో డీఈఈ భవానీశంకర్ విధుల్లో చేరుతూ కమిషనర్ కనకారావుకు జాయినింగ్ రిపోర్టును అందజేశారు. అనంతరం డీఈఈగా బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు ఉత్తర్వులతో డీఈఈ విధుల్లో చేరారని కమిషనర్ ధ్రువీకరించారు.

రత్నగిరిపై శరన్నవరాత్రికి సర్వం సిద్ధం

- 12న శమీపూజ. రావణసంహారం కార్యక్రమాలు
- 3 నుంచి 12 వరకు రోజుకొక అలంకారంలో అమ్మవారు

అన్నవరం, అక్టోబరు 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శరన్నవరాత్రి వేడుకలకు అధికారులు సర్వంసిద్ధం చేస్తున్నారు. ఈనెల 3 నుంచి 12 వరకు ఈ వేడుకలు జరుగనుండగా వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం నుంచి విశేషపూజలు, సాయంత్రం కుంకుమార్చనలు నిర్వహిస్తారు. చివరిరోజైన 12వ తేదీన రాత్రి 7 గంటలకు శమీపూజ, దేవస్థానం హైస్కూల్ ప్రాంగణంలోను, 8గంటలకు రావణసంహారం కార్యక్రమం దేవస్థానం కళాశాల మైదానంలో చేపట్టనున్నట్లు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

గాంధీ జయంతి రోజున పాఠశాలలు పనిచేయాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

- ఏపీటీఎఫ్ డిమాండ్

కొవ్వూరు, అక్టోబరు 1 : అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతిని పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని పాఠశాలలు పనిచేయాలని ఇచ్చిన ఉత్తర్వులపై ఏపీటీఎఫ్ తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దసరా పండుగను అక్టోబరు 3వ తేదీ నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తుందని 10 రోజుల ముందునుంచే వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో అక్టోబరు 2న గాంధీ జయంతి సెలవు కూడా కలిసి వస్తోందని భావించి ఎంతోమంది ఉపాధ్యాయులు, ప్రయాణాలు, కార్యక్రమాలు పెట్టుకున్నారు. అకస్మాత్తుగా విద్యాశాఖ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడాలేని విధంగా ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే గాంధీ జయంతి రోజున అన్ని పాఠశాలలు పనిచేయాలని ఉత్తర్వులు విడుదల చేయడాన్ని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.దుర్గారావు, పి. సువర్ణరాజులు అభ్యంతరం తెలిపారు. తక్షణం విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పట్టా భూముల్లోనూ ఇసుక తీతలు



గాయత్రీ ర్యాంపులో బోట్స్‌మన్ సొసైటీ సభ్యులతో జేసీ చినరాముడు

- ఓపెన్ ర్యాంపులకు టెండర్లు పిలిచే యోచన
- మొక్కుబడిగా మొదలైన ఇసుకతీత
- ఇంకా అయోమయంలోనే బోట్స్‌మెన్ సొసైటీలు
- గాయత్రీ రెండు ర్యాంపులకు కొలతలు
- అనుమతి మేరకు ఇసుక తీయాలి: జేసీ చినరాముడు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి):

ఇక ఇసుక కొరత కొద్దిరోజులు మాత్రమే. పట్టా భూముల్లో కూడా ఇసుక తీతకు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో గోదావరి లంకల్లోని పట్టా భూముల్లో ఇసుక కూడా తీసి ఉచిత ఇసుక విధానంలో సరఫరా చేయవచ్చు. బహుశా ఈనెల 15 తర్వాత ఓపెన్ ర్యాంపులు కూడా అమల్లోకి వచ్చే అవకాశముంది. ప్రస్తుతం బోట్స్‌మెన్ సొసైటీల ద్వారా డీసిల్టేషన్ కూడా మొదలవుతోంది. ఇవన్నీ మొదలైతే జిల్లాలో ఇసుక కొరత అనేదే ఉండదు. ఇతర ప్రాంతాలకు కూడా సరఫరా చేసే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం డీసిల్టేషన్ పాయింట్లలో ఇసుక తీత ఇంకా అయోమయంలోనే ఉంది. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు ఆధ్వర్యంలో ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్, ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశేశ్వరరావు, మైన్స్ ఏజీ విఘ్నేష్, అర్బన్ తహశీల్దార్ పీహెచ్ పాపారావు, డీఈఈలు, గాయత్రీ ర్యాంపులను పరిశీలించారు. బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులతో మాట్లాడారు. ఇసుకతీత వెంటనే ప్రారంభించాల్సిన అవసరాన్ని వివరించారు. గాయంత్రీ 1, 3 ర్యాంపులను ఒక ర్యాంపుగానూ, 2, 4 ర్యాంపులను మరో ర్యాంపుగానూ గుర్తించి కొలతలు వేయించారు. కానీ అక్కడ ఇప్పటికే సుమారు 20 బోట్స్‌మెన్ సొసైటీలకు అనుమతిచ్చారు. కానీ ఏ పాయింట్‌లో ఎవరు ఇసుక పోగుపెట్టాలనేది స్పష్టం చేయలేదు. అధికారుల సూచన మేరకు కొందరు సుమారు 15వేల టన్నుల ఇసుకను తీసి గుట్టపెట్టారు. రేపోమాపో మరికొందరు ఇసుక తీస్తారు. కానీ వీరంతా ఇసుక ఎక్కడ వేయాలనేది కూడా స్పష్టత లేకపోవడంతో అందరూ అయోమయంలో పడ్డారు. వీరికి డబ్బు ఎవరిస్తారనేది కూడా ఇంకా స్పష్టత లేదు. ఈనెల 11వ తేదీ తర్వాత బోట్స్‌మెన్ సొసైటీలన్నింటి ద్వారా ఇసుక తీయించడానికి ఓ ఏజెన్సీ వస్తుందనే ప్రచారం ఉంది. అప్పటివరకూ ఈ ఇసుక తీత ఓ తతంగం మాదిరిగానే ఉండవచ్చనే అంచనా ఉంది. త్వరలో ఓపెన్ ర్యాంపులు కూడా అమలులోకి రానున్నాయి. అవి సుమారు 31 వరకూ ఉండవచ్చు. వాటి నిర్వహణకు టెండర్లు పిలిచే ఆలోచన కూడా ఉన్నట్టు సమాచారం.

అనుమతి మేరకు ఇసుక తీయాలి: జేసీ చినరాముడు

ప్రభుత్వం ఇచ్చిన అనుమతి మేరకు ఇసుక తీత, సరఫరా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు చెప్పారు. గాయత్రీ ర్యాంపులను పరిశీలించిన ఆయన బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులతో మాట్లాడారు. మంగళవారం 15వేల టన్నుల ఇసుక తీసినట్టు బోట్స్‌మెన్ సొసైటీలు చెప్పాయి. ఈ ర్యాంపుల నుంచి రెండు లక్షల మెట్రిక్ టన్ను ఇసుక లభ్యత ఉంటుందని అధికారులు జేసీకి తెలిపారు. ప్రతిరోజూ ఇసుక సరఫరా సామర్థ్యాన్ని పెంచాలని జేసీ ఆదేశించారు.

మన్యంలో మద్యం షాపులన్నీ స్థానిక గిరిజనులకే!

- అన్ని షాపులకూ పీసా గ్రామసభల ఆమోదం తప్పనిసరి
- 40 షాపులకు నోటిఫికేషన్ జారీ చేసిన అల్లూరి కలెక్టర్



రంపచోడవరం, అక్టోబరు1: మన్యంలోని మద్యం షాపులన్నీ స్థానికంగా ఉండే గిరిజనులకే ఇవ్వాలని ప్రభుత్వం నిశ్చయించి 2024-26కు రూపొందించిన మద్యం విధానంలో నిర్దేశించింది. ఈమేరకు రూపొందించిన నిబంధనలలో గిరిజన ప్రాంతాలకు సంబంధించి మార్గదర్శకాలను ఖరారు చేసింది. అల్లూరి జిల్లాలోని రంపచోడవరం, చింతూరు, పాడేరు డివిజన్లలో మొత్తంగా 40మద్యం షాపులకు మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆమోదంతో గెజిట్ నోటిఫికేషన్ జారీ అయింది. ప్రభుత్వం మద్యం విధానాన్ని రూపొందించడంలోనే గిరిజన ప్రాంతాలకు సంబంధించి అనుసరించాల్సిన మార్గదర్శకాలను గిరిజన ప్రాంతాల చట్టాలను దృష్టిలో ఉంచుకుని ఖరారు చేసింది.

పీసా నిబంధనల ప్రకారం కేటాయింపు

గిరిజన ప్రాంతాలకు కేటాయించిన షాపులన్నిటికీ గిరిజన ప్రాంతాల పంచాయతీరాజ్ చట్టం(పీసా) నిబంధనల ప్రకారం ఆయా గ్రామసభల నుంచి షాపుల ఏర్పాటుకు ఆమోదాలను తీసుకోవాల్సి ఉంటుంది. గ్రామసభల నుంచి నాలుగు వారాలలో ఆమోదం లభించని పక్షంలో, నాలుగువారాల అనంతరం దానిని ఆమోదం లభించినట్టుగానే భావించాల్సి ఉంటుందని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఇక్కడ షాపులన్నీ స్థానికంగా ఉండే గిరిజనులకే కేటాయించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

షాపుల వివరాలు

రంపచోడవరం డివిజన్లో రంపచోడవరంలో రెండు, దేవీపట్నంలో ఒకటి, వై.రామవరంలో ఒకటి, అడ్డతీగలలో రెండు, గంగవరంలో ఒకటి, మారేడుమిల్లిలో ఒకటి, రాజవొమ్మంగిలో రెండు, చింతూరులో మూడు, ఎటపాకలో రెండు, కూనవరంలో ఒకటి, వి.ఆర్.పురంలో రెండు చొప్పున మద్యం షాపులను కేటాయిస్తూ కలెక్టరు నోటిఫై చేశారు. రంపచోడవరం ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు పరిధిలోని షాపులకు రంపచోడవరంలోనూ, చింతూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు పరిధిలోని షాపులకు చింతూరు లోనూ దరఖాస్తులను దాఖలు చేసుకోవచ్చు. ఈనెల 11న పాడేరులోని ఎస్పీ కార్యాలయం సమీపంలోని వి.ఆర్.ఫంక్షన్ హాల్‌లో లాటరీ పద్ధతిన అన్నిషాపులకు లైసెన్సులను మంజూరు చేస్తారు.

హైవేల మీద, గుడి, బడి పక్కనా మద్యం షాపులు ఉండొద్దు

- మద్యం విధాన నిబంధనల్లో రాజీపడని కూటమి ప్రభుత్వం

జాతీయ రహదారులపైనా, రాష్ట్ర హైవేలపైనా, గుడిపక్కనా, బడి పక్కనా మద్యం షాపులు ఉండొద్దని కూటమి ప్రభుత్వం తేల్చిచెప్పింది. 2024-26 మద్యం విధానంలో ఎక్కడా కూడా హైవేలపైనా, గుడులు, బడులపైనా ఎక్కడా మద్యం షాపులు ఉండ కుండా నిర్దిష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. హైవేల ను ఆనుకుని కనుచూపు మేరలో ఎక్కడా కూడా మద్యం షాపులు ఉండొద్దని, జాతీయ రహదారి, స్టేట్ హైవేను ఆనుకుని 500 మీటర్ల పైబడిన ప్రాంతంలోనే ఈ షాపులను నెలకొల్పాలి. ఈ విధంగా మన్యం మీదుగా రాజమహేంద్రవరం నుంచి అరకు జాతీయ రహదారి పైనా, భద్రాచలం హైవేపైనా ఎక్కడా షాపులకు అవకాశం లేదు. 500 మీటర్ల లోపలకు షాపులను నెలకొల్పుకోవచ్చు. గుడులు, బడులు ఉన్నచోట 100 మీటర్ల పైబడి ఎక్కడా షాపులు ఉండరాదని నిబంధనల్లో పేర్కొంది.

దారి దోపిడీకి పాల్పడిన ఏడుగురి అరెస్టు

- రూ.1.70 లక్షల నగదు, రెండు బైక్‌లు స్వాధీనం

నరసాపురం, అక్టోబరు 1: మండలంలోని సీతారాంపురం టోల్ ప్లాజా సమీపంలో సోమవారంరాత్రి ఓ చిరు వ్యాపారిని కొట్టి రూ.2లక్షలు దోపిడీకి పాల్పడిన కేసు మిస్టరీని పోలీసులు కొద్ది గంటలోనే ఛేదించారు. తోటి వ్యాపారిని ఆర్థికంగా దెబ్బతీయాలన్న అక్కసుతోనే ఇదే వ్యాపారం చేస్తున్న మరో ఇద్దరు ఐదుగురు కిరాయి వ్యక్తులతో ఈ దోపిడీకి పాల్పడినట్లు అదనపు ఎస్పీ మురళీకృష్ణ చెప్పారు. మంగళవారం సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి గ్రామానికి చెందిన రాపాక చంద్రరావు విదేశీ వస్తువుల విక్రయిస్తుటాడు. దీంతో పాటు విదేశాల నుంచి వచ్చిన వారి నుంచి కరెన్సీ కొనుగోలుచేసి వాటిని వెస్ట్రన్‌మనీ సెంటర్లలో అమ్ముతుంటాడు. ఇదే ప్రాంతానికి చెందిన మేడిద వెంకటరెడ్డి, మానిక్యబాబులు కూడా ఇదే వ్యాపారం చేస్తుంటారు. అయితే చంద్రరావు వ్యాపారం స్పీడ్‌గా ఉండడంతో అతన్ని ఆర్థికంగా దెబ్బతీయాలని ఇద్దరు స్కెచ్ వేశారు. కోనసీమ జిల్లా రాజోలు ప్రాంతానికి చెందిన ఆకుల ప్రభుతేజ, సాధనాల మణికంఠ, భయ్యా హేమసాగర్, కోరుకొండ గిరిబాబు, గంటారాజు, మలికిబాబులను పురమాయించి రెండు లక్షలు విలువైన విదేశీ కరెన్సీ నోట్లు ఉన్నాయంటూ చంద్రరావుకు ఫోన్ చేయించారు. సీతారంపురం సమీపంలోని రాజుగారితోట టోల్ ప్లాజా వద్దకు వస్తే అందజేస్తామని నమ్మించారు. ఇది నిజమని భావించిన చంద్రరావు డబ్బుతో అక్కడికి చేరుకున్నాడు. అప్పటికే అక్కడ మాటు వేసిన కిరాయి వ్యక్తులు అయిగురు చంద్రరావుపై దాడి చేశారు. తెచ్చిన నగదు రూ.2 లక్షలు దోచుకుపోయారు. వెంటనే తేరుకున్న చంద్రరావు మొగల్తూరు పోలీసుల్ని ఆశ్రయించడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టగా, వెంకటరెడ్డిపై అనుమానం వచ్చిందన్నారు. లోతైన విచారణ చేయగా మొత్తం కేసు మిస్టరీ వీడిందన్నారు. మంగళవారం ఉదయం నింధితులంతా పట్టణంలోని ఓ లాడ్జీలో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.1.75 లక్షల నగదు,రెండు బైక్‌లు, పది విదేశీ కరెన్సీనోట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏమావేశంలో సీఐలు యాదగిరి, ప్రసాద్, ఎస్సై వాసులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

- పంచారామంలో ఏర్పాట్లు పూర్తి

సామర్లకోట, అక్టోబరు 1: పంచారామ పుణ్యక్షేత్రమైన సామ ర్లకోట కుమార రామభీమేశ్వ రాలయంలో ఉన్న బాలాత్రిపుర సుందరి అమ్మవారి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు మూడో తేదీ గురువారం నుంచి 12 తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఆలయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేయడమేగాక జిల్లా, రాష్ట్రం నలుమూలల నుంచీ ఆలయానికి వచ్చే భక్తులకు నిత్యాన్నదాన పథకం ద్వారా అన్నప్రసాదాలను అందించేందుకు ఏర్పాట్లూ పూర్తిచేశారు. 3న గురువారం ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనము, ఆచార్యులు, రక్షాభంధనము, కలశస్థాపన నిర్వహించనున్నారు. నవరాత్రి జరుగు తొమ్మిదిరోజులూ ఉదయం 8 గంటల నుంచి దుర్గాసప్తశతిపారాయణ, బాలాపరమేశ్వరీ మంత్రజపములు నిర్వహిస్తారు.

వృద్ధురాలిని బండి ఎక్కించుకుని.. పింఛన్ సొమ్ము లాక్కొని.. పరారైన అగంతుకుడు

- గాయపడిన వృద్ధురాలు



గాయపడ్డ వృద్ధురాలికి తిరిగి పింఛన్ అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

పిఠాపురం, అక్టోబరు 1: వృద్ధురాలిని గాయపరిచి పింఛన్ సొమ్ము లాక్కొని అగంతకుడు పరారయ్యాడు. ఈ సంఘటన కాకినాడ జిల్లా పిఠాపురంలోని జగ్గయ్యచెరువుకాలనీలో మంగళవారం జరిగింది. గొల్లపేటకు చెందిన గోపాలపు అనంతలక్ష్మి కాలనీలోని 11వ వార్డు సచివాలయం పింఛన్ తీసుకునేందుకు వచ్చింది. సిబ్బంది ఇచ్చిన రూ.4వేలును తీసుకుని బయటకు రాగానే ఒక అగంతకుడు వచ్చి మీ ఇంటి వైపే వెళుతున్నాను దిగబెడతాను అని మోటార్‌సైకిల్ ఎక్కించుకున్నాడు. ఇంటి దగ్గర దింపకుండా మండలపరిషత్ కార్యాలయం సమీపం రోడ్డులోకి తీసుకువెళుతుండటంతో వృద్ధురాలు ప్రశ్నించింది. దీంతో వృద్ధురాలిని మోటార్‌సైకిల్‌పై నుంచి తోసేసి ఆమె వద్ద ఉన్న రూ.4వేలను తీసుకుని అగంతకుడు పరారయ్యాడు. కిందపడిపోయిన వృద్ధురాలికి ముఖంపై గాయాలయ్యాయి. వెనుక స్కూటీపై వస్తున్న వ్యక్తి సదరు అగంతకుడిని పట్టుకునేందుకు ప్రయత్నించినా దొరకలేదు. దీంతో వృద్ధురాలు అక్కడే కూర్చుండిపోయింది. స్థానికులు ఆమె కు సపర్యలు చేశారు. సీసీ కెమేరా దృశ్యాలు ఆధారంగా పట్టణ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న మునిసిపల్ కమిషనర్ కనకారావు తన స్వంత సొమ్ము రూ.4వేలను సచివాలయ సిబ్బంది ద్వారా ఆ వృద్ధురాలికి అందజేశారు.

మాకు న్యాయం చేయాలి

- మద్యం షాపుల కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన
- మద్యం దుకాణాల మూసివేత
- బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయాలు



అనపర్తిలోని ప్రభుత్వ మద్యం దుకాణం మూసివేసి నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

అనపర్తి, అక్టోబరు 1: ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు మంగళవారం షాపులను మూసివేసి నిరసన తెలిపారు. గతనెల 30వ తేదీతో తమ గడువు ముగిసిందని తమ భవిష్యత్ అంధకారంగా మారిందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తమ అర్హతను బట్టి మద్యం డిస్పెన్సరీలలోగానీ మరో చోటగాని పని కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈనెల 12 నుంచి ప్రైవేటు షాపులు ప్రారంభం కానున్న నేపథ్యంలో వీరంతా షాపులను మూసివేసి నిరసన తెలుపుతున్నారు. వీరి సమ్మెతో మద్యం దొరకదని గ్రహించిన మందుబాబులు బ్లాక్ మార్కెట్ వైపుకు పరుగులు పెట్టడంతో నిర్వాహకులు మద్యం ధరలు పెంచేశారు. ఫుల్ బాటిల్‌కు రూ.500, క్వార్టర్‌కు రూ.100-150 అదనంగా వసూలు చేస్తున్నారు. సాయంత్రం 7గంటల సమయంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల యూనియన్ నుంచి వచ్చిన సమాచారంతో అనపర్తి కెనాల్ రోడ్డులోని షాపును తెరవడంతో మందు బాబులు ఎగబడ్డారు. ఈనెల 5వ తేదీ వరకు వేచి చూడాలని రాష్ట్ర యూనియన్ ఇచ్చిన సమాచారం మేరకు అక్కడక్కడా షాపులు తెరుచుకున్నట్టు సమాచారం.

స్మార్తుల కోసం ప్రత్యేక భవనం నిర్మించాలి

అమలాపురంటౌన్, అక్టోబరు1: స్మార్త కార్యకలాపాలు నిర్వహించే విధంగా అమలాపురంలో స్థలాన్ని కేటాయించి ప్రత్యేక భవనం నిర్మించాలని ఆపస్తంభ పురోహిత పరిషత్ ఆధ్వర్యంలో స్మార్త పండితులు మంగళవారం అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సామాజిక భవనం నిర్మించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఏపీపురోహిత సమాఖ్య కోనసీమ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉపద్రష్ట విజయాదిత్యను నియమించగా ఎంపీ అభినందించారు.

- అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్
- జిల్లాలో ఘనంగా జీఎంసీ బాలయోగి జయంతి
- నివాళులర్పించిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

కోనసీమలో రైలు కూత వినిపించేందుకు కృషి

అమలాపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దివంగత లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి 73వ జయంతి వేడుకలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మంగళవారం ఘనంగా జరిగాయి. బాలయోగి విగ్రహానికి పూలమాలలువేసి నేతలు నివాళులర్పించారు. అమలాపురంలోని జీఎంసీ బాలయోగి ఘాట్‌లో జరిగిన కార్యక్రమానికి జిల్లాకు చెందిన కూటమి ప్రజాప్రతినిధులు హాజరై ఘనంగా నివాళులర్పించారు. లోక్‌సభ సభ్యులు గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు (కొత్తపేట), గిడ్డి సత్యనారాయణ (పి.గన్నవరం), దాట్ల బుచ్చిరాజు (ముమ్మిడివరం)లతో పాటు మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, టీడీపీ నేతలు నామన రాంబాబు, మెట్ల రమణబాబు, మట్టా మహాలక్ష్మిప్రభాకర్, బొర్రా ఈశ్వరరావు, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, నల్లా స్వామి, నల్లా విష్ణు, గణపతి వీరరాఘవులు, బోనం సత్తిబాబు, పేరాబత్తుల రాజశేఖర్, చిల్లా పురుషోత్తం, జనసేన నాయకులు నల్లా శ్రీధర్, యేడిద శ్రీను, యాళ్ల నాగసతీష్, బీజేపీ నాయకులు మోకాసుబ్బారావు, పాలూరి సత్యానందంతో పాటు జిల్లా నలుమూలల నుంచి పలువురు తరలివచ్చి బాలయోగి ఘాట్‌లో నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంపీ హరీష్‌మాధుర్ మాట్లాడుతూ తన తండ్రి జీవితాశయాలను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అంకితమివ్వడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. దీనిలో భాగంగా బాలయోగి స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రతిపాదనలు ఇప్పటికే సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపించామన్నారు. కోనసీమలో రైలు కూత వినిపించేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ అభివృద్ధి, స్ఫూర్తి ప్రదాతగా పేరు ప్రఖ్యాతలు పొందిన బాలయోగి లేని లోటును తనయుడు హరీష్ మాధుర్ తీరుస్తారన్న నమ్మకాన్ని వ్యక్తంచేశారు. తొలుత ఎంపీ హరీష్‌మాధుర్ తన నివాస గృహంలో బాలయోగి చిత్రపటం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పి.గన్నవరం: జీఎంసీ బాలయోగి కోనసీమను అభివృద్ధి పథంలో నడిపించిన మహోన్నత వ్యక్తి అని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కొనియాడారు. పి.గన్నవరం అక్విడెక్టు వద్ద బాలయోగి విగ్రహానికి కూటమి నాయకులు, ఆయన పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొండాడ నాగమణి, ఎంపీటీసీ పుల పర్తి చినవెంకటలక్ష్మి, మట్టపర్తి రామకృష్ణ, చొల్లంగి సత్తిబాబు, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, నక్కా సత్యనారా యణ, అంబటి కోటేశ్వరావు, శేరు శ్రీనుబాబు, ఆరుమిల్లి సాయిబాబు, పేరిచర్ల నాగరాజు, కె.సత్యనారాయణరాజు, గుత్తుల రామకృష్ణ, తాటికాయల శ్రీనివాసరావు, కుంపట్ల నాయుడు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి జయంతిని ముమ్మిడివరంలో కూటమి నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ముమ్మిడివరం పోలమ్మచెరువు గట్టున ఉన్న బాలయోగి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, దొమ్మేటి రమణకుమార్, అర్థాని శ్రీనివాసరావు, గొల్లపల్లి గోపి, చిక్కాల అంజిబాబు, దూడల స్వామినాయుడు, బద్రి రమా, కట్టా సత్తిబాబు, నడిమింటి సూర్యప్రభాకరం, బూరగ కల్యాణ్, గాలిదేవర బుల్లి, గొలకోటి సాయిబాబు, యలమంచిలి బాలరాజు, గొలకోటి శ్రీను, గాలిదేవర గణేష్, గొలకోటి బాబి తదితరులు పాల్గొన్నారు.


అమలాపురం: బాలయోగి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న ఎంపీ హరీష్, ఐ.పోలవరం: పాతయింజరం వద్ద బాలయోగికి నివాళులర్పిస్తున్న దృశ్యం


మామిడికుదురు: అభివృద్ధికి మారుపేరుగా దివంగత మాజీ లోక్‌సభ స్పీకర్ బాలయోగి నిలుస్తారని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు అన్నారు. పాశర్లపూడి, మగటపల్లిలో బాలయోగి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాశర్లపూడిలో ఆయన విగ్రహానికి కూటమి నాయకులు పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, మండలశాఖల అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, మెండా బాబ్జి, జాలెం శ్రీనివాసరాజా, నాయకులు ఈలి శ్రీనివాస్, బోనం బాబు, సూదా బాబ్జి, దొంగ సత్తిబాబు, గంధం భాస్కర్, మల్లాడి విష్ణు, వర్ధినీడి బాబ్జి, తుండూరి బుజ్జి, సాపే ఏకాదశి, నాయకులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: కాట్రేనికోన గేట్ సెంటర్‌లో బాలయోగి జయంతి నిర్వహించారు. నాగిడి నాగేశ్వరరావు, ఆకాశం శ్రీనివాస్, విత్తనాల బుజ్జి, వాసంశెట్టి రాజేశ్వరరావు, చీకురుమిల్లి చక్రధర్, మోకా లోవరాజు, సత్తాల ప్రసాద్, పోలిశెట్టి పెద్ద, బీమాల సూర్యనాయుడు, గెద్దాడ శ్రీను పాల్గొన్నారు.

ఐ.పోలవరం: బాలయోగి కోనసీమ అభివృద్ధి ప్రదాత అని ఎంపీ గంటి హరీష్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. పాతయింజరం వద్ద బాలయోగి విగ్రహానికి వారు పూలమాలలువేసి నివాళులర్పించారు. బాలయోగి స్వగ్రామం రామాలయంపేట, మురమళ్ళ మార్కెట్ సెంటర్లలో బాలయోగి విగ్రహాలకు నివాళులర్పించారు. పేదలకు చీరెలు, దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, పేరాబత్తుల రాజశేఖర్, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, గొలకోటి దొరబాబు, మందాల గంగసూర్యనారాయణ, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, దూడల స్వామి, మద్దింశెట్టి పురుషోత్తం, సాగిరాజు సూరిబాబురాజు, గాదిరాజు బుచ్చికృష్ణంరాజు, సాకా నీతాదేవి, లంకలపల్లి దుర్గాదేవిమునిరాజు పాల్గొన్నారు.

అంబాజీపేట: కోనసీమ అభివృద్ధి ప్రదాత జీఎంసీ బాలయోగి జయంతి సందర్భంగా స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలువేసి ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోకన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ, నాయకులు గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, అరిగెల బలరామమూర్తి, దొమ్మేటి సాయికృష్ణ, పబ్బినీడి రాంబాబు, మంద రాజేష్, రవణం రాము, పళ్ళ శ్రీను, దొమ్మేటి రామారావు పాల్గొన్నారు.

మలికిపురం: అందరి మదిలో బాలయోగి చిరస్మరణీయుడని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం దిండి వై.జంక్షన్‌లో బాలయోగి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, గుబ్బల శ్రీనివాస్, ఎం.శ్రీనివాసరాజు, గుండుబోగుల పెదకాపు, దోనిపాటి రాజు, భూపతిరాజు సాయిబాబురాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మలికిపురంలోని శ్రీరామాపురంలో బాలయోగి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గెడ్డం తులసీభాస్కర్, నల్లి శివ, చింతా రాజబాబు, కొల్లాబత్తుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: టేకిశెట్టిపాలెంలో బాలయోగి చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. మండలంలో పలుగ్రామాల్లో బాలయోగి జయంతిని కూటమి శ్రేణులు నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి తాడి సత్యనారాయణ, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

రాజోలు: టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజోలు కాటన్ పార్కులో ఉన్న బాలయోగి విగ్రహానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలువేసి మంగళవారం నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంపీపీ కేతా శ్రీను బాలయోగి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంద్రేగుల సత్యనారాయణ, సూరిశెట్టి శ్రీనివాస్, చాగంటి స్వామి, పొలమూరి శ్యామ్‌బాబు, సర్పంచ్ కడలి సత్యనారాయణ, జగడం సత్యనారాయణ, అడబాల విజయ్, పామర్తి రమణ, కాంద్రేగుల భవానీ, మటపర్తి లక్ష్మి, గాలిదేవర వెంకన్నబాబు, కడలి వెంకటరమణారావు, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, గుబ్బల కుమార్, మానుకొండ దుర్గాప్రసాద్, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావు, కడలి నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం బాలయోగి పార్కులో బాలయోగి విగ్రహానికి కూటమి నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, చిక్కం కాసు, పెయ్యల దుర్గారావు, సలాది శ్రీనివాసరావు, గొలకోటి సత్తిరాజు, చిక్కం పెదబాబు, నల్లా బాబండి, ఏవీ కృష్ణారావు, చిక్కం పెద్దబ్బులు, రవణం మధు, వీరా వెంకటేశ్వరరావు, బూసి బుజ్జిదొర, అడబాల సత్యనారాయణ, మధుర నరసింహమూర్తి, ఆకుల వెంకటరమణ, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, లంకే శ్రీనివాసరావు, దోనిపాటి అశోక్, నిమ్మకాయల పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: కోనసీమ అభివృద్ధి ప్రదాత జీఎంసీ బాలయోగి అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం పాత బస్టాండ్ సెంటర్‌లో బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ బూసి జయలక్ష్మిభాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, దర్నాల రామకృష్ణ, రెడ్డి రామకృష్ణ, కముజు వెంకటేశ్వరరావు, బీర ఇసాక్, రెడ్డి తాతాజీ, తమ్మన సాయిప్రసాద్, గుబ్బల మూర్తి, పెనుమళ్ల అన్నవరం, ముద్రగడ సుబ్బారావు, బయ్యే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యానాం: యానాం సమాచారశాఖఆధ్వర్యంలో జీఎంసీ బాలయోగి జయంతి వేడుకలు ఘన నిర్వహించారు. స్థానికపరిపాలనాధికారి కార్యాలయం సమీపంలోని ఆయన విగ్రహానికి పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సీఐ షణ్ముగం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు శంకర్ బాలయోగి చేసిన సేవల గురించి వివరించారు. ఎస్ఐలు శేరు నూకరాజు, జె.ప్రభాకర్‌రావు, కె.సుబ్రహ్మణ్యం, సమాచారశాఖదికారి కె.ఎల్.వి.ప్రసాద్, మట్టపర్తి శ్రీను పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ


మండపేట: పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మలికిపురం, అక్టోబరు 1: సామాజిక పింఛన్లు కుటుంబాలను ఎంతగానో ఆదుకుంటున్నాయని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. దిండిలో మంచానికే పరిమితమైన వృద్ధులకు మంగళవారం ఆయన పింఛన్లు అందజేశారు.గుండుబోగుల పెద్దకాపు, సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, బందెల పద్మ, పినిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: మండలంలో 9176మందికి (98శాతం) పింఛన్లను పంపిణీ చేశారు. బోడసకుర్రులో డీఎల్‌డీవో త్రినాథనాయుడు, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి పింఛన్లను అందచేశారు. అల్లవరంలో ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ తెల్లవారుజామున పింఛన్లు అందజేశారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్తపేట: వాడపాలెంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. వాడపాలెం సర్పంచ్ త్సామా బాబు, బండారు బుల్లితాత, చీకట్ల అబ్బు, పప్పుల బుజ్జి, కుడుపూడి కొండ, బండారు ప్రసాద్, దూలం రాజు పాల్గొన్నారు.

అంబాజీపేట: మండలంలో 9,241 పింఛన్లకు 9,108 పింఛన్ల పంపిణీ (98.56 శాతం) పూర్తయిందని ఎంపీడీవో సరోవర్ తెలిపారు. పుల్లేటికుర్రులో డీఆర్‌డీఏ అధికారి శివశంకరప్రసాద్ పింఛన్‌దారులకు సొమ్మును అందించారు.

ఆలమూరు: ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కలవచర్లలో మంగళవారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. మూడు నెలలకోసారి పింఛన్ తీసుకునే విధంగా త్వరలోనే కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. ఎంపీడీవో జాన్‌లింకన్, నాయకులు వడ్డి వెంకన్న, మెర్ల గోపాలస్వామి, వంటిపల్లి సతీష్‌కుమార్, ఈదల నల్లబాబు, వక్కపట్ల లక్ష్మణరావు పాల్గొన్నారు.

మండపేట: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వేగుళ్ల పాల్గొన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు, గీసాల సత్తిబాబు, చెలబోటి వీర్రాజు, పవలివెల జానకి రామయ్య, గుమ్మళ్ల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: మండలంలో తెల్లవారుజాము నుంచే సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. రావులపాడులో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని పలువురికి పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

గంటిలో చోరీ

కొత్తపేట, అక్టోబరు1: గంటి గ్రామంలో నాయుడు వీరన్నకు చెందిన ఇంట్లో బంగారం, వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు అతని కుమారుడు దుర్గామహేష్ తెలిపారు. శుక్రవారం రాత్రి హైదరబాద్‌లో బంధువుల ఇంట్లో ఓ వేడుకకు సంబంధించి కుటుంబ సభ్యులందరూ ఇంటికి తాళం వేసి వెళ్లారు. మంగళవారం పింఛన్ తీసుకునే నిమిత్తం వీరన్న సోదరుడు నాయుడు సూరిబాబు గంటి గ్రామానికి చేరుకోగా ఇంటి తలుపులు పెకిలించి ఉండటాన్ని గమనించి చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ జి.సురేంద్ర చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. కేసుదర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

రాజోలు, అక్టోబరు1: రాజోలు బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు స్కూలు గేమ్స్ ఫెడరేషన్ 2024-25లో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయిలో కాకినాడలో జరిగిన జిల్లాస్థాయి యోగా, చెస్, త్రైక్వాండో, ఆటల పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం ఎం.సుహాసినీ మంగళవారం తెలిపారు. అండర్-17 బాలికల విభాగంలో పి.నాగేశ్వరి, ఎస్.రాము, పి.హేమధన, అండర్-14 చెస్ బాలికల విభాగంలో వి.జోత్స్న, అండర్-14 త్రైక్వాండోలో వై.గంగాభవానీ ఎంపికయ్యారన్నారు.

కౌన్సిలర్ పదవికి రాజీనామా!

అమలాపురంటౌన్, అక్టోబరు1: అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తూ 8వ వార్డు కౌన్సిలర్ తిక్కిరెడ్డి వెంకటేశ్వరరావు (వెంకటేష్) మంగళవారం లేఖ విడుదల చేశారు. కొంతకాలంగా ఆరోగ్యపరంగా, ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొంటున్నందున ప్రజలకు సేవలందించలేని పరిస్థితుల్లో ఆయా పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. రాజీనామా లేఖను ఒక వ్యక్తితో చైర్‌పర్సన్‌కి పంపినట్టు తెలిసింది.

బెల్ట్ దుకాణానికి వేలం పాట
ఏడాదికి రూ.9.75లక్షలు కట్టేందుకు ఒప్పందం

కాట్రేనికోన, అక్టోబరు 1: తీరప్రాంత మత్స్యకార గ్రామం చిర్రయానాంలో అనధికార మద్యం దుకాణం ఏర్పాటుకు గ్రామ పెద్దల సమక్షంలో వేలం నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఏడాది పాటు దుకాణం నడుపునకునేందుకు రూ.9.75లక్షలకు పాడుకున్నట్టు తెలిసింది. ఈనెల5వ తేదీన వేలం సొమ్ము పెద్దలకు ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. ఈ సొమ్మును గ్రామంలో జాతరలకు ఖర్చు చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు మద్యం దుకాణాలకు టెండర్లు పిలవనుంది. మంగళవారం నుంచి ఈకార్యక్రమం ప్రారంభమైంది. ఇదే రోజు చిర్రయానాంలో మద్యం అమ్ముకునేందుకు వేలం పాట జరిగింది. పాటదారులు ఈనెల12వ తేదీ వరకు ఎన్డీపీ లిక్కర్ అమ్ముకునేందుకు అంగీకారం కుదిరింది. అదేవిధానాన్ని కొనసాగించడంతో పాటు అప్పుడప్పుడు అధికార మద్యం దుకాణాల నుంచి నామమాత్రంగా కొనుగోలు చేస్తారు. ఇలా కొనుగోలు చేసిన మద్యం క్వార్టర్ బాటిల్‌కు రూ.20 అదనంగా వసూలు చేస్తారు.

సార్వాకు ఎండుతెగులు బెడద


ఉప్పలగుప్తం, అక్టోబరు 1: సార్వా పైరుకు ఎండుతెగులు బెడద ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెదగాడవిల్లి రైతు సేవా కేంద్ర పరిధిలోని పొలాలను మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి, ఏరువాక శాస్త్రవేత్త ఎం.నందకిశోర్, ఏడీఏ ఎంఏ షంషీ, డీఆర్సీ ఏడీఏ వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

తిరుమల లడ్డూ కల్తీపై కూటమినేతల నిరసన

అల్లవరం, అక్టోబరు 1: తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రతపై నిరసనగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా కొమరగిరిపట్నం, బెండమూర్లంక గ్రామాల్లో జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు పాదయాత్ర చేశారు. నెయ్యి కల్తీ దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

ఉద్యోగాల పేరుతో రూ.20 లక్షల టోకరాపై ఫిర్యాదు

అల్లవరం, అక్టోబరు1: మాజీ మంత్రి సన్నిహితుడని ఫొటోలు చూపించిన కొమరగిరిపట్నానికి చెందిన సబ్బితి సుజన్ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆశచూపి రూ.20లక్షలు తీసుకుని మోసం చేశాడని పలువురు బాధితులు ఎస్పీ కృష్ణారావుకు ఫిర్యా దు చేశారు. ఎస్పీ ఆదేశాలతో ఎస్ఐ హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భముగా శుభాకాంక్షలతో

మహనీయుడు పుజ్యబాపుజీ మహాత్మాగాంధీ అడుగు జాడల్లో నడుద్దాం-గ్రామస్వరాజ్య సాపన దిశగా అడుగులు వేద్దాం- పల్లె సీమలను దేశానికి పట్టుకొమ్మలుగా చేద్దాం-గాంధీ జయంతి వేళ మహాత్మునికి నివాళులు అర్పిస్తూ...

1. స్వచ్ఛతా హీ సేవా 2024 మరియు క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా గ్రామ పంచాయతీలో ప్రతి ఇంటికి మూడు డస్ట్ బిన్లు పంపిణీ చేయడం జరిగినది. తడి చెత్త, పొడి చెత్త మరియు ప్రమాదకరమైన చెత్తగా మూడు డస్ట్ బిన్ల యందు వేరు చేసి గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు అందించవలెను.
2. ఇళ్ళ వద్ద తొట్లు, కుండలు, డ్రమ్ములలో నీటిని నిల్వ చేసేటపుడు దోమలు చేరకుండా మూతలు పెట్టడం చేయాలి.
3. ఇంటిపైన, మరుగుదొడ్డు పైన గల పనికిరాని వస్తువులను బోర్లించి ఉంచాలి. వర్షం నీరు మురుగు నీరు డ్రైన్లలో పారునట్లు చూడాలి.
4. ఖాళీ స్థలములను మట్టితో పూడ్చుకోవాలి. పిచ్చి మొక్కలను తీసివేయాలి. ఇంటి ద్వారాలకు, కిటికీలకు మెస్‌లను అమర్చాలి. ఉదయం.6.00 గం నుండి 8.00 గం వరకు సాయంత్రం 6.00 గం నుండి 8.00 గం మధ్య తలుపులను, కిటికీలను మూసి ఉంచుకొనుట.
5. రాత్రిపూట నిద్రించేటపుడు దోమ తెరలను వాడట. నూలు వస్త్రములు చేతులనిండా ధరించవలయును.
6. జ్వరం వస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్ళి రక్త పరీక్ష చేయించుకొని, తగిన వైద్యం చేయించుకొనవలెను. కావున మండపేట మండలంలోని గ్రామ పంచాయతీ, సచివాలయ పరిధిలో ప్రజలు అందరూ పైన తెలిసిన సూచనలు పాటించి తమ ఆరోగ్యములను కాపాడుకొని ప్రభుత్వానికి సహకరించవలసినదిగా కోరడమైనది.

సిద్ధార్థలో దసరా వేడుకలు



ఆలమూరు, సెప్టెంబరు1: ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూల్‌లో మంగళవారం దసరా ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలను స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు ప్రారంభించి విజయదశమి విశిష్టతను వివరించారు. వివిధ వేషధారణల్లో విద్యార్థులు సందడి చేశారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెం సిద్ధార్థ పాఠశాలలో డైరెక్టర్ కె.ముల్లారావు ఆధ్వర్యంలో దసరా వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

16న మంచినీటి పథకం ప్రారంభం

అంబాజీపేట, అక్టోబరు1: మాచవరంగ్రామపంచాయతీ పరిధి కామయ్యకోడులో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ఈనెల16న ప్రారంభిస్తానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. మంచినీటిపథకాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పద్మనాభం, నాయకులతో కలిసిఆయన పరిశీలించారు. మాచవరం గ్రామప్రజలందరికి రక్షిత మంచినీటిని పూర్తిస్థాయిలో అందిస్తానన్నారు.


5న పీహెచ్‌సీ ప్రత్యేక బ్లాక్ ప్రారంభం

కపిలేశ్వరపురం, అక్టోబరు1: అంగర పీహెచ్‌సీ ఆవరణలో బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బలుసు జానకి రామయ్య పర్యవేక్షణలో రూ.75లక్షలతో నిర్మించిన ప్రాథమికఆరోగ్య కేంద్రం ప్రత్యేక బ్లాక్‌ను ఈనెల5న మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. దివంగత బలుసు రుద్రయ్య పెద్ద కుమారుడు డాక్టర్ సుబ్బారావు, భార్య వసుంధర జ్ఞాపకార్థం పీహెచ్‌సీకి రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రూ.75లక్షలు విరాళం అందజేశారు.

అగ్నికుల క్షత్రియుల అభ్యున్నతికి కృషి చేయండి

అంతర్వేది, అక్టోబరు 1: అగ్నికుల క్షత్రియుల అభ్యున్నతికి కృషి చేయాలని మంత్రి కొల్లు రవీంద్రకు అంతర్వేదికి చెందిన అగ్నికుల క్షత్రియులు కొల్లు మహలక్ష్మి, తిరుమాని ఆచార్యులు, ఇల్లింగి వెంకటరమణ, పోతాబత్తుల రాంబాబు వినతిపత్రం అందించారు. గోదావరిలో పడవల ద్వారా ఇసుక తీసుకుని జీవనోపాధి పొందుతున్న కార్మికులకు మత్స్యకార సొసైటీల ద్వారా అవకాశం కల్పించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారు.

వార్డు కౌన్సిలర్ కట్టా శ్రీరాములు మృతి



రామచంద్రపురం(ద్రాక్షారామ),అక్టోబరు1: రామచంద్రపురం 27వ వార్డుకౌన్సిలర్,విశ్రాంత హాస్టల్‌వార్డెన్ కట్టాశ్రీరాములు (76) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. శ్రీరాములు మృతదేహాన్ని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైసీపీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, వైస్‌చైర్మన్ కొలమూరి శివాజీ, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు సందర్శించి నివాళులర్పించారు.

వరిలో వెదజల్లే విధానం మేలు

ముమ్మిడివరం, అక్టోబరు 1: వరి సాగులో విత్తనం వెదజల్లే విధానం ద్వారా ఖర్చు తగ్గించుకుని, అధిక దిగుబడులు సాధ్యమవుతుందని రైతు శిక్షణా కేంద్రం డిప్యూటీ డైరెక్టర్, వై.జ్యోతిర్మయి పేర్కొన్నారు. చినకొత్తలంక గ్రామంలో వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్ మాట్లాడుతూ వరి పైరుపై బాక్టీరియా, ఎండు ఆకు తెగులు ఆశించినట్టు గుర్తించామన్నారు. ఏడీఏ రాజశేఖర్ ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఉద్యానవన విస్తరణాధికారి పద్మ ఆర్ఆర్ పథకం గురించి వివరించారు. పొత్తూరి భ్రమరాంబ, పొత్తూరి మల్లికార్జునవర్మ, పొత్తూరి రామకృష్ణరాజు, పచ్చమట్ల సూర్యనారాయణరాజు, ముదునూరి సత్యనారాయణరాజు, పొత్తూరి సత్యనారాయణరాజు, పెద్దిరెడ్డి వెంకటసుబ్రహ్మణ్యం, గ్రామ వ్యవసాయ సహాయకులు చక్రి, చిన్నీ, రైతు సేవా కేంద్రం ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర హాకీ జట్టుకు వెంటూరు పాఠశాల విద్యార్థిని



రాయవరం, అక్టోబరు 1: వెంటూరు ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని మేడిశెట్టి లక్ష్మీప్రసన్న రాష్ట్ర హాకీ జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం డి.సత్తిరాజు తెలిపారు. స్కూల్‌గేమ్ ఫెడరేషన్ అండర్-14 విభాగంలో జిల్లా జట్టుకు లక్ష్మీప్రసన్న ప్రాతినిధ్యం వహించింది. హాకీలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్రస్థాయి జట్టులో చోటుదక్కించుకుందన్నారు.

వైసీపీ నేత అన్నందేవుల అరెస్టు

మండపేట, అక్టోబరు 1: కేశవరానికి చెందిన వైసీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ, ఆర్‌టీకే మాజీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావును అరెస్టు చేసినట్టు మండపేట రూరల్ ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. కేశవరంలో అంకం మంగాదేవి గతనెల 20న చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. కేసు విచారణ అనంతరం అతడిని అరెస్టు చేసి రామచంద్రపురంలో కోర్టులో హాజరుపర్చగా కోర్టు 14రోజులు రిమాండ్ విధించిందన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, అక్టోబరు 1: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన పేరిచర్ల సూర్యనారాయణరాజు రూ.1,01,000 విరాళం సమర్పించారు.


సీఎం సహాయనిధికి రూ.15వేలు విరాళం

అమలాపురం రూరల్, అక్టోబరు 1: విజయవాడ వరద బాధితులకు వన్నె చింతలపూడి (సమనస) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూ.15 వేలు సేకరించి మంగళవారం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతికి అందజేశారు.

రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా వైట్ల



ఆలమూరు, అక్టోబరు1: రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఆలమూరుకు చెందిన కృష్ణ ప్రభాస్ గ్రూప్ ఆఫ్ డైరెక్టర్ వైట్ల కనకదుర్గారావు నియమితులయ్యారు. రాష్ట్ర అసోసియేషన్ నుంచి ఆయనను నియమించినట్లు సమాచారం అందించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌లో కీలకంగా ఉండే దుర్గారావు మిల్లర్స్ సమస్యలపై స్పందించి వాటిని పరిష్కరించడంలో ప్రధాన భూమిక పోషించేవారు.


మండపేట పురపాలక సంఘం-మండపేట

ఆర్.ఓ.సి.నెం.555/2022-ఎఫ్1 ది.30-09-2024

నోటిఫికేషన్

1. స్వచ్ఛతా హీ సేవా 2024 మరియు క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా పట్టణములోని ప్రతి ఇంటికి మూడు డస్ట్ బిన్లు పంపిణీ చేయడం జరిగినది. తడి చెత్త, పొడి చెత్త మరియు ప్రమాదకరమైన చెత్తగా మూడు డస్ట్ బిన్ల యందు వేరు చేసి పురపాలక సంఘ పారిశుధ్య కార్మికులు అందించవలెను.
2. తొట్లు, కుండలు, డ్రమ్ములలో నీటిని నిల్వ చేసేటపుడు దోమలు చేరకుండా మూతలు పెట్టడం.
3. ఇంటిపైన, మరుగుదొడ్డు పైన గల పనికిరాని వస్తువులను బోర్లించి ఉంచాలి, లేదా తొలగించాలి. వర్షం నీరు నిల్వలను, ఇంటి వాడిక నీరు డ్రైన్లలలో వెళ్ళేటట్లు చూడాలి.
4. ఖాళీ స్థలములను మట్టితో పూడ్చుకోవాలి. పిచ్చి మొక్కలను తీసివేయాలి. ఇంటి ద్వారాలకు, కిటికీలకు మెస్‌లను అమర్చాలి. ఉదయం.6.00 గం నుండి 8.00 గం వరకు సాయంత్రం 6.00 గం నుండి 8.00గం మధ్య తలుపులను, కిటికీలను మూసి ఉంచుకొనుట.
5. రాత్రిపూట నిద్రించేటపుడు దోమ తెరలను వాడుకోవాలి. నూలు వస్త్రములు చేతులనిండా ధరించవలయును.
6. జ్వరం వస్తే వెంటనే రక్త పరీక్ష చేయించుకొని, తగిన వైద్యం చేయించుకొనవలెను.

కావున మండపేట పురపాలక సంఘ పరిధిలో ప్రజలు అందరూ పైన తెలిసిన సూచనలు పాటించి తమ ఆరోగ్యములను కాపాడుకొనుటలో మున్సిపాలిటీకి సహకరించవలసినదిగా కోరడమైనది.

కమిషనర్
మండపేట పురపాలక సంఘం